## అరచేతిలో వాతావరణ సమాచారం




వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లు రూపొందించింది. ఆండ్రాయిడ్ మొబైల్ ఉంటే చాలు.. సమస్త సమాచారం మన అరచేతిలో ఉన్నట్లే.

8లో▶



## ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన బోధన

9లో▶

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు సర్కారు చర్యలు చేపట్టింది. ప్రైవేట్‌కు ధీటుగా వసతులు కల్పిస్తోంది.

గరిష్టం/కనిష్టం
42.0/31.0

## వాతావరణం

పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

## న్యూస్‌రీల్

### కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం నిర్వహించిన ప్రథమ సంవత్సరం పరీక్షకు 2,207 మందికి గాను 1,694 మంది హాజరు కాగా, 513 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 845 మందికి గాను 808 మంది హాజరు కాగా,37మంది గైర్హాజరైనట్లు డీఐఈవో రవీందర్‌కుమార్ తెలిపారు.

### పశుపోషణతో అదనపు ఆదాయం



డెయిరీ ఫాంను పరిశీలిస్తున్న కిషన్

ఇచ్చోడ: రైతులు సాగుకు అనుబంధంగా పశుపోషణ చేపడితే అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా పశువైద్యాధికారి కిషన్ అన్నారు. మండలంలో పలు డెయిరీ ఫాంలను మంగళవారం పరిశీలించి పాడి రైతులతో మాట్లాడారు. పశుపోషణ రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. వర్షాకాలం ప్రారంభంలోనే పశువులకు టీకాలు ఇప్పించాలని సూచించారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారి గోవింద్ నాయక్, తదితరులున్నారు.

### 'ఓపెన్' డిగ్రీ పరీక్షలు షురూ

ఆదిలాబాద్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీ ప్రథమ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తొలి పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు కొనసాగింది. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ప్రతాప్ సింగ్ పరిశీలించారు.

### విత్తన, ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సమితి నాయకులు

కైలాస్‌నగర్: జిల్లాలో కొనసాగుతున్న నకిలీ పత్తి విత్తనాల తయారీ, పంపిణీ ముఠా, ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ రాజర్షి షాను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. విత్తనాలు, ఇసుకను అక్రమంగా అమ్ముతున్న, సరఫరా చేస్తున్న వ్యక్తులపై పీడీ యాక్ట్ నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే బేల మండలంలో కొనసాగుతున్న ఇసుక మాఫియాను అరికట్టాలని, నూతనంగా టెండర్లు ఆహ్వానించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా అధ్యక్షుడు భూమన్న, ప్రధాన కార్యదర్శి శోభతాయి, రాజన్న, క్రాంతికుమార్ తదితరులున్నారు.

### 'ఇన్‌చార్జి మంత్రి బాధ్యత వహించాలి'

ఆదిలాబాద్‌టౌన్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల కొనుగోలు విషయంలో రైతుల ఆవేదనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క బాధ్యత వహించాలని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో గతంలో ఎన్నడు లేని విధంగా నకిలీ విత్తనాల ముఠాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. విత్తనాల కొనుగోలు కోసం ఉదయం 7గంటల నుంచే రైతులు దుకాణాల ఎదుట బారులు తీరాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. దీన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి రైతులకు మేలు రకమైన పత్తి విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఇటీవల పట్టుబడ్డ నకిలీ విత్తనాల ముఠాపై పీడీయాక్ట్ నమోదు చేయాలని పేర్కొన్నారు.




# విత్తన అగచాట్లు

- పత్తి విత్తనాల కోసం రైతుల పరేషాన్
- డిమాండ్ రకంపైనే ఆసక్తి
- ఎండలో గంటల తరబడి బారులు
- ఆందోళన వద్దంటున్న వ్యవసాయ శాఖ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా అంటేనే పత్తికి పెట్టింది పేరు. సుమారు 85 శాతం మించి రైతులు ఈ పంటనే సాగు చేస్తుంటారు. ఇక్కడి నేలకు అనుకూలంగా ఉన్న విత్తనాలతో మంచి దిగుబడి వస్తుండంతో ఆ డిమాండ్ రకంపైనే అందరూ ఆసక్తి చూపుతున్నారు. దాదాపు నెలరోజులుగా వాటి కోసం రైతులు అగచాట్లు పడుతున్నారు. డీలర్ల వద్దకు వచ్చినప్పటికీ రేపుమాపు అంటూ తిప్పుకుంటున్నారు. రుతుపవనాలు ముందస్తుగానే వస్తున్నాయని శాస్త్రవేత్తలు చెబుతుండడంతో విత్తనాల కొనుగోలుపైనే రైతులు దృష్టి సారించారు. ఇప్పటికే దుక్కులు దున్ని భూములను సిద్ధం చేసుకున్నారు. ఓ భారీ వర్షం పడిందంటే విత్తేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సమయంలో రైతులకు అవసరమైన విత్తనాలులభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

**ఆ రకమే ఎందుకంటే..**

జిల్లాలో 5లక్షల 87వేల ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణం ఉంది. ఈ సీజన్‌లో 4లక్షల 16వేల ఎకరాల్లో పత్తి సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మిగతా 70వేల ఎకరాల్లో సోయాబీన్, 30వేల ఎకరాల్లో కందులు, మిగతావి ఇతర పంటలు సాగు కానున్నాయి. ఆ డిమాండ్ రకం–659కు సంబంధించి దిగుబడి ఎక్కువగా వస్తుందని రైతులు చెబుతున్నారు. జిల్లాలో గత ఐదేళ్లుగా ఆ కంపెనీకి చెందిన విత్తనాలకు డిమాండ్ ఉంది. గతేడాది 1లక్ష 20వేల ప్యాకెట్ల విత్తనాలను రైతులు కొనుగోలు చేశారు. ఎకరాకు 13 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. అలాగే పంట చేతికొచ్చినప్పుడు తీయడానికి సులువుగా ఉంటుందని, ఇతర రకం విత్తనాలతో పోల్చితే దీని ద్వారా సగం మంది కూలీలతో పని అవుతుందని చెబుతున్నారు. నల్లరేగడి భూములకు ఈ రకం అనుకూలంగా ఉండటంతో రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. మిగతా రకం కూడా ఎకరానికి 10 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాకు 125 రకాల పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొంటున్నారు. ప్రస్తుతం 10 రకాలకు మాత్రమే అధిక డిమాండ్ ఉంది.

**రైతుకు రెండు ప్యాకెట్ల చొప్పున ఇవ్వడంతోనే లొల్లి..**

జిల్లా నలుమూలల నుంచి డిమాండ్ రకం పత్తి విత్తనాల కోసం రైతులు మంగళవారం జిల్లా కేంద్రానికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. మహిళా రైతులు సైతం తరలివచ్చారు. దుకాణాల ఎదుట క్యూలో బారులు తీరారు. ఎండను సైతం లెక్కచేయకుండా తమవంతు కోసం వేచి చూశారు. ఆధార్ కార్డు ఆధారంగా ఒక్కో రైతుకు రెండు ప్యాకెట్లు మాత్రమే అందజేశారు. అయితే జిల్లాలో చిన్న, సన్నకార రైతులు ఐదు ఎకరాల వరకు సాగు చేస్తుండగా, పెద్ద రైతులు 15 నుంచి 20 ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. దీంతో ఈ రెండు ప్యాకెట్లు ఏ రైతుకు కూడా సరిపోకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. గతేడాది 1లక్ష 20వేల ప్యాకెట్లు అందుబాటులో ఉంచగా, ఈ ఏడాది కేవలం 65వేల ప్యాకెట్ల వరకు మాత్రమే వచ్చాయి. దీంతో విత్తనాల కోసం రైతులకు అవస్థలు తప్పడం లేదు. మొత్తం 10లక్షల 50వేల ప్యాకెట్లు అవసరం ఉండగా, ఇప్పటివరకు 8లక్షల ప్యాకెట్లు జిల్లాకు వచ్చాయి. ఇందులో డిమాండ్ రకం ప్యాకెట్లు తక్కువగా ఉండడం గమనార్హం. దీన్ని ఆసరాగా చేసుకొని కొంత మంది డీలర్లు డిమాండ్ రకం విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ఆందోళన వద్దు..



రైతులు ఆందోళన చెందవద్దు. ఆ కంపెనీతో మాట్లాడి డిమాండ్ రకం పత్తి విత్తనాలు తెప్పించేందుకు చర్యలు చేపడుతున్నాం. 8లక్షల 70వేల వరకు పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచాం. డిమాండ్ రకంకు సంబంధించి మరో 65వేల వరకు తెప్పించేందుకు కంపెనీ వారితో మాట్లాడాం. ఇందుకు వారు ఒప్పుకున్నారు. మిగతా రకం విత్తనాలు వేసుకుంటే కూడా మంచి దిగుబడి వస్తుంది. జూన్ చివరి వారం వరకు కూడా విత్తుకోవచ్చు.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి

# టీకాతో టీబీకి చెక్

- 18 ఏళ్లు పైబడిన వారికి బీసీజీ వ్యాక్సిన్
- ఆగస్టు మొదటి వారంలో ఇచ్చేలా ప్రణాళిక
- 2025 వరకు క్షయ పూర్తిగా నివారించడమే లక్ష్యం



జిల్లా కేంద్రంలోని టీబీ కార్యాలయం

జిల్లాలో గడిచిన నాలుగేళ్లుగా గుర్తించిన వ్యాధిగ్రస్తుల వివరాలు..

| సంవత్సరం | గుర్తించిన వ్యాధిగ్రస్తులు |
|---|---|
| 2021 | 1,341 |
| 2022 | 1,565 |
| 2023 | 1,476 |
| 2024 (ఏప్రిల్ వరకు) | 563 |

ఆదిలాబాద్‌టౌన్: టీబీ (క్షయ) మహమ్మారికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దేశంలో 2025 నాటికి వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతుంది. అంటువ్యాధి కావడంతో రోగుల సంఖ్య చాపకింద నీరులా పెరుగుతుంది. మరోవైపు ఒకరి నుంచి మరొకరికి సోకకుండా సర్కారు ప్రత్యేక చర్యలు చేపడుతుంది. ప్రస్తుతం టీబీ ప్రబలకుండా చిన్నారులకు బీసీజీ టీకా వేస్తున్నారు. దీని ప్రభావం ఎక్కువ కాలం ఉండటం లేదని తెలుస్తోంది. ఈ క్రమంలో 18 ఏళ్లు పైబడిన వారికి టీకా ఇచ్చేందుకు వైద్యారోగ్యశాఖ కసరత్తు చేస్తుంది. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంల ద్వారా సర్వే చేపట్టిన తర్వాత ఆగస్టు మొదటి వారంలో కార్యక్రమాన్ని ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించారు. ఇందుకు సంబంధించి జిల్లాలోని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులకు బుధవారం శిక్షణ నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కల్పించనున్నారు.

**పైలెట్ ప్రాజెక్ట్‌గా..**

టీబీని నిర్మూలించేందుకు బీసీజీ టీకా రాష్ట్రంలోని 17 జిల్లాల్లో మొదటి దశలో అమలు చేస్తున్నారు. ఇందులో ఆదిలాబాద్ జిల్లా ఉంది. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధి కారి, వైద్యాధికారులు, ఇతర సిబ్బందికి శిక్షణ కల్పించారు. వీరు బుధవారం జిల్లాలోని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులకు డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో సిబ్బందికి శిక్షణ కల్పిస్తారు. వైద్య సిబ్బంది గ్రామాలు, పట్టణాల్లోని ఆయా కాలనీల్లో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారు. ఆరు అంశాలకు సంబంధించి తెలుసుకొని ఎవరికి టీకాలు వేయాలో నివేదిక తయారు చేసి పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికారులకు సమర్పిస్తారు. ఆ తర్వాత జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు అవసరమైన వ్యాక్సిన్లను తెప్పించేందుకు నివేదికలు పంపిస్తారు.

**టీబీ విస్తరిస్తోంది..**

టీబీ మహమ్మారి ఒకరి నుంచి మరొకరికి విస్తరిస్తోంది. చాలా మంది పరీక్షలు చేసుకునేందుకు ముందుకు రాకపోవడంతో కుటుంబ సభ్యులకు, వారితో సన్నిహితంగా ఉన్నవారికి వ్యాప్తి చెందుతుంది. అయితే వ్యాధి ముదిరితే మరణాలు సంభవించే అవకాశాలు కూడా లేకపోలేదు. ఏడాదికి కనీసం 50 మంది వరకు మృతి చెందుతున్నట్లు తెలుస్తోంది. మందులు సకాలంలో వాడితే ఆరు నెలల్లోపు నయం అవుతుందని వైద్యాధికారులు చెబుతున్నారు. శరీరంలోనే వెంట్రుకలు, గోళ్లు మినహా అన్ని భాగాలకు టీబీ వ్యాపిస్తుందని పేర్కొంటున్నారు.

**2025 నాటికి నివారించడమే లక్ష్యం..**

దేశంలో టీబీని 2025 సంవత్సరం నాటికి నిర్మూలించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గడిచిన రెండు మూడేళ్లుగా వ్యాధిని అంతమొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 18 ఏళ్లు పైబడిన వారికి టీకా వేసేలా ప్రణాళికలు చేపట్టింది. అయితే ఇందులో ఆరు రకాల వ్యక్తులను గుర్తించి టీకాలు వేయనున్నారు. డయాబెటిక్ (షుగర్) ఉన్నవారికి, పొగ తాగే వారికి, పొడవు, బరువు (18.5 కేజీలు) తక్కువగా ఉన్నవారికి, గత ఐదేళ్లలో టీబీ సోకి నయం అయినవారికి, వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు, 65ఏళ్లు పైబడిన వారందరికీ ఈ బీసీజీ టీకా వేయనున్నారు.

### టీబీ రహిత జిల్లా లక్ష్యం..

టీబీ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు 18ఏళ్లు పైబడిన వారిలో ఆరు రకాల వ్యక్తులను గుర్తించి టీకాలు వేయడం జరుగుతుంది. బుధ, గురువారాల్లో జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యాధికారులకు శిక్షణ ఇస్తున్నాం. ఆ తర్వాత ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలు సర్వే చేపడతారు. జిల్లాలో ఎంత మందికి టీకా అవసరమో గుర్తించిన తర్వాత ఆగస్టు మొదటి వారంలో టీకా ఇచ్చేలా చర్యలు చేపడుతున్నాం. వ్యాక్సిన్ ద్వారా వ్యాధి నిర్మూలన అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

# పారదర్శకంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

- కలెక్టర్ రాజర్షి షా
- కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ

కైలాస్‌నగర్: వచ్చే నెల 4న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి మంగళవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లుగా తెలిపారు. పోలైన ఓట్లు, పోలింగ్ బూత్‌ల ఆధారంగా లెక్కింపు టేబుళ్లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 4న ఉదయం 8గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఇందు కోసం వేర్వేరుగా టేబుల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల వరకు పూర్తి ఫలితాలు వెల్లడవుతాయన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎన్నికల పరిశీలకులు, సహాయ రిటర్నింగ్ అధికారి, సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వర్స్‌తో పాటు వివిధ పార్టీల ఏజెంట్లు పాల్గొంటారన్నారు. ఓట్ల లెక్కింపు విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతకు ముందు కౌంటింగ్‌లో సిబ్బంది అనుసరించాల్సిన విధానాలపై మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భోరజ్ చెక్‌పోస్టు వద్ద ఏసీబీ తనిఖీలు

- మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు రికార్డులు పరిశీలన
- రూ.11,630 అదనంగా లభించినట్లు సీఐ తిరుపతి వెల్లడి
- శాఖాపరమైన చర్యలకు ఆదేశం



రికార్డులు పరిశీలిస్తున్న ఏసీబీ సీఐ తిరుపతి

జైనథ్: మండలంలోని భోరజ్ గ్రామ సమీపంలో గల 44వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుపై ఏసీబీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఏసీబీ సీఐ తిరుపతి సిబ్బందితో కలిసి ఆర్టీఏ కార్యాలయంలో సోదాలు చేపట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ ఆదేశాలతో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. మా రాకను గమనించి అక్కడ పనిచేస్తున్న నవీన్ అనే ప్రైవేట్ వ్యక్తి పారిపోయేందుకు యత్నించగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతడిని తనిఖీ చేయగా రూ.11,630 లభించినట్లు తెలిపారు. మరో ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులు పరారైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కార్యాలయంలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. అక్కడ పనిచేస్తున్న ప్రైవేట్ వ్యక్తి వద్ద లెక్కలో లేని అదనపు డబ్బులు లభించడంతో డ్యూటీలో సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యల కోసం ఆర్టీఏ ఉన్నతాధికారులకు సిఫార్సు చేయడంతో పాటు ఏసీబీ డీజీకి పూర్తి నివేదిక పంపించనున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఆర్టీఏ అధికారుల వద్ద నుంచి రెడ్‌హ్యాండెడ్‌గా డబ్బులు స్వాధీనం చేసుకున్నట్లు పుకార్లు వచ్చినప్పటికీ అలాంటిదేమి లేదని సీఐ తెలిపారు.

# 'సేంద్రియ'ం.. బహుదూరం!



నేరడిగొండ మండలం లింగట్ల గ్రామ పంచాయతీలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్ ఇది. ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల నేపథ్యంలో కంపోస్టు ఎరువు తయారీపై పంచాయతీ సిబ్బంది దృష్టి సారించారు. ప్రస్తుతం నాడెపు కంపోస్టు షెడ్‌ను సిద్ధం చేస్తున్నారు.



ఇది మావల మండలం బట్టిసావర్‌గాం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్ నిర్మాణం. రూ.2.50లక్షల వ్యయంతో 2020లో దీన్ని నిర్మించారు. సేంద్రియ ఎరువు తయారీకి పంచాయతీ యంత్రాంగం ఇప్పటి వరకు ఎలాంటి కసరత్తు చేపట్టకపోవడంతో అలంకారప్రాయంగా మారింది. గ్రామంలో పోగైన తడి, పొడి చెత్తను సేకరించి ఇందులో వేరు చేసి ఎరువు తయారు చేయాల్సి ఉండగా అలాంటి ఆనవాళ్లేవి ఇక్కడ కనిపించడం లేదు.

- చాలా గ్రామాల్లో చెత్త సేకరణకే పరిమితం
- ఎరువుల తయారీని పట్టించుకోని కార్యదర్శులు
- తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు
- అమలుపైనే సందేహాలు

కైలాస్‌నగర్: గ్రామాల్లో పొగయ్యే చెత్త సేకరణ ద్వారా సంపద సృష్టించాలనే ప్రభుత్వ ఆదేశాలపై పంచాయతీల్లో పట్టింపు కరువైంది. తడి, పొడి చెత్తను సేకరించి వాటిని వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేసేందు కోసం గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. అయితే ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం, పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంతో చాలా చోట్ల అలంకారప్రాయంగా మారాయి. జిల్లాలోని ఒకటి, రెండు మినహా మెజార్టీ పంచాయతీలు దీనిపై దృష్టి సారించకపోవడం గమనార్హం. ఫలితంగా రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారి సర్కారు లక్ష్యం నీరుగారిపోతోంది.

**నిరుపయోగంగా షెడ్లు**

గ్రామాలను సంపూర్ణ పారిశుధ్యంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. పల్లె ప్రగతి కార్యక్రమం కింద ప్రతీ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.50లక్షలతో వీటిని నిర్మించారు. జిల్లాలోని 468 గ్రామ పంచాయతీల్లో ఈ షెడ్లను నిర్మించారు. ఆయా గ్రామాల్లో పోగైన చెత్తను ప్రతి రోజు సేకరించి వాటిని సెగ్రిగేషన్ షెడ్లకు తరలించేందుకు వీలుగా ట్రాక్టర్లను సైతం పంచాయతీలకు అందజేసింది. 2021లో ఈ షెడ్లను నిర్మించగా జిల్లాలోని మెజార్టీ పంచాయతీల్లో ఎరువు తయారు కావడం లేదని తెలుస్తోంది. ఆయా గ్రామాల్లోని ఇళ్లలో పోగైన చెత్తను సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది సెగ్రిగేషన్ షెడ్లకు కాకుండా డంపింగ్‌యార్డులు, గ్రామాల్లోని రోడ్లపైనే పడేసి కాల్చివేస్తున్నారు. ఫలితంగా సర్కారు లక్ష్యం నేరవేరక పోగా, చెత్తను తగలబెట్టడం ద్వారా వచ్చే పొగతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి..**

జిల్లాలో సేంద్రియ ఎరువుల తయారీ ప్రక్రియ బహుదూరంగా నిలుస్తోంది. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ షెడ్లకు తరలించి వేరు చేస్తారు. తడి చెత్తను డీకంపోస్టు చేయడంతో రెండు రోజుల్లోనే పూర్తిగా కుళ్లిపోతుంది. షెడ్డులో ఉన్న బెడ్‌పై వేయగా అప్పటికే అందులోని వాన పాములు దానిని సేంద్రియ ఎరువుగా మారుస్తాయి. ఇలా వారంలో దాదాపు రెండు క్వింటాళ్ల వరకు ఎరువు తయారువుతుంది. వీటిని 20, 50కిలోల బస్తాల్లో ప్యాక్ చేసి ఆయా గ్రామాల్లోని అన్నదాతలకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుంది. అయితే జిల్లాలో కేవలం 30 నుంచి 40 పంచాయతీలు మాత్రమే సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నాయి. ఆయా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపుతుండడంతో ఇది సాధ్యమవుతుంది. మిగతా చోట్ల షెడ్లు అలంకారప్రాయంగా మారాయి. అయితే ప్రతీ పంచాయతీలో సేంద్రియ ఎరువు తయారీ జరగాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇటీవల ఆదేశించిన నేపథ్యంలో కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు ఏ మేరకు దృష్టి సారిస్తారో వేచి చూడాల్సిందే.

### ప్రత్యేక దృష్టి సారిస్తాం



కంపోస్టు ఎరువు తయారీ కోసమే ప్రతీ గ్రామ పంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించుకున్నాం. కొన్ని పంచాయతీల్లో మొన్నటి వరకు కొనసాగిన సర్పంచ్‌లు, అలాగే కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపడంతో ఎరువు తయారవుతుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై ప్రతీ పంచాయతీలోనూ సేంద్రియ ఎరువు తయారీ జరిగేలా ప్రత్యేక దృష్టి సారిస్తాం.

– ఎస్.శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి

## క్లుప్తంగా

### డీఎల్పీవో ఉదారత

తాంసి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో తీవ్రగాయాలపాలైన యువకుడిని తన వాహనంలో ఆస్పత్రికి తరలించిన డీఎల్పీవో ఫణీందర్‌రావు ఉదారత చాటుకున్నారు. మంగళవారం భీంపూర్ మండలం అర్లి(టి)లో వివిధ పల్లెప్రగతి పనులను పరిశీలించిన డీఎల్పీవో జిల్లా కేంద్రానికి తిరుగు పయనమయ్యారు. అర్లి(టి), వడూర్ గ్రామాల మధ్య బైక్ అదుపుతప్పి కింద పడి గాయపడ్డాడు. క్షతగాత్రుడిని తన వాహనంలో ఎక్కించుకుని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు.

### చిరుత సంచారం

భైంసారూరల్: మండలంలోని సిరాల శివారులోని గుట్ట ప్రాంతంలో మంగళవారం చిరుత పులి సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన డేరే మాధవ్ మహాదేవుని గుట్ట ప్రాంతంలోని గుహల వద్ద చిరుత సంచరిస్తుండగా గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

### తేనెటీగల పెంపకంపై శిక్షణ

ఉట్నూర్‌రూరల్: తేనెటీగల పెంపకంపై ఇవ్వనున్న శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐటీడీఏ పరిధిలో ఆసక్తి కలిగిన గిరిజన యువతీ యువకులు , రైతులు ఈ శిక్షణ కార్యక్రమానికి తమపేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్టు ఉద్యాన అధికారి లేదా 9848687871, 8897625042 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### శిక్షణ శిబిరాన్ని సందర్శించిన పీవో



పరిశీలిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: భారత్ దేఖో స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని వికాసం ప్రత్యేక పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మంగళవారం సందర్శించారు. పెయింటింగ్, డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్ వంటి వివిధ అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఏటీడీఏ క్రాంతి కుమార్, వికాసం పాఠశాల ప్రిన్సిపాల్ వికాస్, ఎస్సీఆర్పీ బలరాం పాల్గొన్నారు.

### గుర్తుతెలియని మృతదేహం లభ్యం

భైంసాటౌన్: పట్టణంలోని రాహుల్‌నగర్ స్మశాన వాటిక సమీపంలో సుద్దవాగులో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం గుర్తించిన పశువుల కాపర్లు పోలీసులకు సమాచారమివ్వగా మృతదేహాన్ని వెలికితీయించి స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని వయస్సు సుమారు 25 నుంచి 35 ఏళ్లలోపు ఉంటుందని సీఐ రాజారెడ్డి తెలిపారు.



# అరచేతిలో వాతావరణం



- ప్రత్యేక యాప్‌లు రూపొందించిన కేంద్ర ప్రభుత్వం
- వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునే సౌలభ్యం
- అన్నదాతలకు ప్రయోజనకరమంటున్న అధికారులు

ఈ మధ్యకాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకరోజు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా మరొక రోజు ఈదురు గాలులతో కూడిన అకాలవర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్నదాతలు అయోమయానికి గురయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణంలోని మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లు రూపొందించింది. వీటి ద్వారా వాతావరణ పరిస్థితులను అంచనా వేయొచ్చని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రధానంగా వర్షాకాలం మొదలుకానున్న నేపథ్యంలో ఉష్ణోగ్రతల వివరాలు, వర్షాల రాక సమాచారాన్ని కూడా వీటి ద్వారా తెలుసుకోవచ్చు. ఉరుములు, మెరుపుల నుంచి రక్షించుకోవడం, వర్షం పరిస్థితులను అంచనా వేయడం కూడా చేయవచ్చు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ రూపొందించిన ఈ యాప్‌లు రైతులకు తోడ్పడనున్నాయి. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లో ప్లే స్టోర్ ద్వారా వీటిని డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. వాతావరణ సమాచారం మొత్తం మన అరచేతిలో ఉన్నట్లే..ఆ యాప్‌లు ఏమిటో తెలుసుకుందాం..

- నిర్మల్‌ఖిల్లా

### వాతావరణ సమగ్ర వివరాలతో 'మేఘదూత్'




మేఘదూత్ యాప్‌లో వాతావరణానికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది. వర్షపాతం వివరాలు, గాలిలో తేమ, గాలి యొక్క వేగం, గాలి వీచే దిశ, నమోదైన ఉష్ణోగ్రతలు రానున్న 24 గంటల్లో వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుంది. గడిచిన వారం రోజులు, రానున్న మరో నాలుగు రోజుల వాతావరణ విశేషాలు సైతం ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

### 'డామిని'లో ఉరుములు, మెరుపుల హెచ్చరికల సమాచారం




ఒక్కోసారి వాతావరణంలో అప్పటికప్పుడు మార్పులు సంభవించి ఉరుములు మెరుపులు వస్తాయి. పిడుగుపాటు కూడా సంభవించే అవకాశం ఉంటుంది.

ఇలాంటి హెచ్చరికలను తెలిపేందుకు డామిని యాప్ ప్రయోజనకరంగా ఉంటుంది. మెరుపు ఎప్పుడు వస్తుంది? మెరిసినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అప్రమత్తంగా ఉండాల్సిన తీరును ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. లొకేషన్ ఆధారంగా మెరుపులు వచ్చే అవకాశం ఉందో? లేదో? కూడా తెలుస్తుంది. పిడుగు పడినప్పుడు తోటి వారికి అందించాల్సిన వైద్య సహాయం వంటి ప్రాథమిక సమాచారాన్ని తెలియజేస్తుంది. రైతులకు, రైతు కూలీలకు బయటి ప్రాంతాల్లో పనిచేసే వారికి ఈ యాప్ ఎంతగానో తోడ్పడుతుంది.

### వర్ష సూచనకు 'రెయిన్ అలారం'




వర్షం ఎప్పుడు పడుతుంది.. గడిచిన రోజుల వర్షపాతం వివరాలు, రానున్న కాలంలో వర్ష సూచనలను రెయిన్ అలారం యాప్ తెలియజేస్తుంది. మనం నివసిస్తున్న ప్రాంతంలో వాతావరణ వర్ష సూచనలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఏ స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయో, తదితర వివరాలు కూడా తెలియజేస్తుంది. వాతావరణంలోని ఉష్ణోగ్రత, గాలిలోని తేమ, మేఘావృతమైన ప్రాంతాల వివరాలను తగిన డేటాతో వివరిస్తుంది.

### ప్రయాణంలోనూ 'పరీక్ష'పైనే ధ్యాస



డిగ్రీ వార్షిక పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన కెమిస్ట్రీ పరీక్షకు హాజరయ్యేందుకు తన తండ్రితో కలిసి ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్ నుంచి నలంద డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రానికి వెళ్తున్న ఓ విద్యార్థిని బైక్‌పైనే చదువుతూ వెళ్తుండడం గమనార్హం.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

## ప్రజాసమస్యల పరిష్కారానికి సోషలిజమే మార్గం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అబ్బాస్



మాట్లాడుతున్న అబ్బాస్

తలమడుగు: ప్రజా సమస్యలకు సోషలిజమే పరిష్కార మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబ్బాస్ అన్నారు. మంగళవారం సీపీఎం ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ధనిక, పేద అంతరాలు తొలగాలన్నా శ్రామికుల జీవితాల్లో వెలుగులు రావాలన్నా శ్రామిక వర్గ సోషలిజం వస్తేనే సాధ్యమవుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడి దారులకు ఎర్ర తివాచీ పరుస్తూ శ్రామికుల సంపదను కార్పొరేట్లకు దాసోహం చేస్తోందన్నారు. విత్తనాల కోసం రైతులు పడిగాపులు కాయడం బాధాకరమని, మార్కెట్లో అన్నిరకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు ఒకవైపు , కృత్రిమ కొరత మరోవైపు రైతులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి, రాష్ట్ర కమిటీ సభ్యుడు తొడసం భీంరావు, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, కార్యదర్శి వర్గ సభ్యులు లంకా రాఘవులు, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు మంజుల, సోమేశ్, గంగన్న, నాయకులు లింగాల చిన్నాన్న విష్ణు, కొట్నాక్ సక్కు, మడావి నాగోరావ్, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతిలేని ఎరువులు పట్టివేత



పోలీసుల అదుపులో లారీ

తాంసి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడుతున్నాయి. దీనికి తోడు కొందరు ప్రభుత్వ అనుమతిలేని సేంద్రియ ఎరువులను పెద్దఎత్తున నిల్వ చేసి రైతులకు విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. మంగళవారం భీంపూర్ మండలంలోని మహారాష్ట్ర సరిహద్దుగా ఉన్న కరంజి(టి)లో అనుమతి లేని సేంద్రియ ఎరువులను నిల్వ చేయడానికి వ్యాపారులు లారీలో బస్తాలను తీసుకొచ్చారు. అనుమానం వచ్చిన స్థానిక రైతులు వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయడంతో మండల అధికారులకు సైతం సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న వ్యాపారి లారీతో పాటు అక్కడి నుంచి పారిపోయేందుకు యత్నిస్తుండగా భీంపూర్ ఎస్సై ప్రదీప్ కుమార్ సిబ్బందితో కలిసి మండలంలోని గోముత్రి గ్రామ సమీపంలో పట్టుకున్నారు. ఏవో రవీందర్‌తో కలిసి ఎరువులను పరిశీలించి ప్రభుత్వ అనుమతి లేని ఎరువులుగా గుర్తించి లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాటి విలువ రూ.5.55 లక్షల విలువైన 750 బస్తాల ఎరువులు ఉన్నట్లు గుర్తించారు. ఏవో ఫిర్యాదు మేరకు లారీని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఆలయంలో చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్

సారంగపూర్: మండలంలోని అడెల్లి గ్రామ సమీపంలోని ప్రకాష్ తండాలో గల సేవాలాల్ ఆలయంలో చోరీకి యత్నించిన నిందితుడిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. సోమవారం రాత్రి సేవాలాల్ ఆలయంలో చోరీకి యత్నిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు పట్టుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకుని పారిపోయాడు. మంగళవారం ఉదయం బస్టాండ్ ఆవరణలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా తాను నర్సాపూర్(జి) మండలంలోని తురాటి గ్రామానికి చెందిన సైదుల నర్సయ్యగా పేర్కొన్నాడు. సేవాలాల్ ఆలయంలో దొంగతనానికి ప్రయత్నించిన వ్యక్తిని తానేనని, ఇటీవల జామ్ గ్రామంలోని మహాలక్ష్మీ ఆలయం, ఆలూరు పెద్దమ్మతల్లి ఆలయాల్లో కూడా దొంగతనం చేశానని నేరం అంగీకరించడంతో సదరు వ్యక్తిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

## ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి



సాయినాథ్ (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సందీప్

తానూరు: అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని ఖర్బాలాలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఖర్బాలా గ్రామానికి చెందిన తడిపేలు సాయినాథ్ (35) మంగళవారం ఉదయం తన సొంత వ్యవసాయ భూమిలో ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా అదుపుతప్పి అతనిపై బోల్తా పడింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సందీప్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్రగాయాలు



గాయాలపాలైన రాజ్‌ప్రసాద్

నేరడిగొండ: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. ఉట్నూర్ మండలం గొట్టిపటర్ గ్రామానికి చెందిన రాజ్‌ప్రసాద్ సారంగాపూర్ మండలం బీరెల్లి గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

## ఈతకు వెళ్లి యువకుడు మృతి



శివాజీ మాధవ్ (ఫైల్)

కడెం: ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భైంసా మండలం మాంజ్రి గ్రామానికి చెందిన శివాజీ మాధవ్ (25) అదే గ్రామానికి చెందిన విక్రమ్, భోజన్న, సాయినాథ్‌లతో కలిసి మంగళవారం కడెం ప్రాజెక్ట్ మరమ్మతు పనుల కోసం వచ్చారు. మధ్యాహ్న భోజన అనంతరం ప్రాజెక్ట్ దిగువన ఉన్న కుంటలో ఈతకు వెళ్లిన శివాజీమాధవ్ నీటిలో గల్లంతయ్యాడు. ప్రాజెక్ట్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి స్థానికుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని మేనమామ కొనపల్లి లింగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### బావిలో పడి యువకుడు మృతి



రాజు (ఫైల్)

సోన్: మతిస్థిమితం కోల్పోయిన యువకుడు బావిలోపడి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సంతోషం రవీందర్ తెలిపిన వివరాల మేరకు లక్ష్మణచాంద మండలం ధర్మారం గ్రామానికి చెందిన బట్టు రాజు (25) పదేళ్లుగా మతిస్థిమితం కోల్పోయాడు. సోమవారం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం సోన్ మండలంలోని న్యూబొప్పారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని తండ్రి ముత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### మృతదేహం లభ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని వాఘాపూర్ శివారులో మంగళవారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఏఎస్సై యూనుస్ తెలిపారు. వాఘాపూర్ గ్రామానికి చెందిన మడావి నారాయణ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించి దర్యాప్తు చేపట్టారు. ఆదిలాబాద్ పట్టణంలోని కొత్త హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన గజేశ్వర్ సునీల్ (45)గా గుర్తించారు. మృతుడు కొంతకాలంగా మూర్ఛతో పాటు మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో అతని భార్య కొన్నాళ్లుగా విడిగా ఉంటోంది. శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లగా మంగళవారం మృతదేహాన్ని గుర్తించారు. మూర్ఛ వ్యాధి కారణంగా పడిపోవడంతో వడదెబ్బకు గురై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుని కుమారుడు సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వివరించారు.

### దాడికి పాల్పడిన భర్తపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన మహెమూద్ -అఫ్సాన దంపతుల మధ్య గతేడాది నుంచి గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆమె గతేడాది మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటినుంచి పుట్టింట్లోనే ఉంటోంది. సోమవారం మహెమూద్ అత్తారింటికి వెళ్లి కాపురానికి రావాలని భార్యను కోరాడు. ఆమె నిరాకరించడంతో కోపోద్రిక్తుడై బండరాయితో కడుపులో కొట్టాడు. అడ్డు వచ్చిన అఫ్సాన తల్లి హుస్నూర్‌తో పాటు మరో మహిళపై సైతం దాడి చేశాడు. బాధితులు మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లాల్‌సింగ్ నాయక్ వివరించారు.

### వంకులంలో చోరీ

రెబ్బెన: మండలంలోని వంకులం గ్రామానికి చెందిన బోర్కుటే తిరుపతి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి నగదుతో పాటు బంగారం అపహరించుకుని వెళ్లినట్లు ఎస్సై డి.చంద్రశేఖర్ తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులంతా వారం రోజుల క్రితం తిరుపతికి వెళ్లి మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి ఇంటిముందు తలుపులు తెరిచి ఉన్నాయి. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా తాళం పగలగొట్టి ఉంది. అందులో భద్రపర్చిన రెండు తులాల బంగారంతో పాటు, రూ. 20 వేల నగదు కనిపించకపోవటంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్ పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో టిప్పర్, ట్రాక్టర్

బేల: మండలంలోని జాతీయ రహదారి మార్గంలో దహెగాం క్రాస్ వద్ద సోమవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు కాంగార్‌పూర్ రెవెన్యూ గ్రామ శివారులోని పెన్‌గంగ ఇసుక క్వారీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం మంగళవారం తహసీల్దార్‌కు నివేదించామన్నారు.

## నకిలీ విత్తనాలు స్వాధీనం



విత్తనాలు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

చింతలమానెపల్లి: మండలంలోని దిందా గ్రామంలో మంగళవారం 10 కిలోల నకిలీ విత్తనాలు పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా డగే తిరుపతి ఇంటి ముందు పత్తి విత్తనాలు దొరికాయి. విచారణలో ఈవిత్తనాలు కుంటల మానెపల్లి గ్రామానికి చెందిన శివుడు సరఫరా చేసినట్లు తేలింది. వ్యవసాయ అధికారి రామకృష్ణ ఫిర్యాదు మేరకు డగె తిరుపతి, శివుడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## డ్రైవింగ్ స్కూళ్లలోనూ లైసెన్స్

- జూన్ ఒకటి నుంచి కొత్త చట్టం అమలు
- కనీసం మూడెకరాల స్థలం అవసరం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రహదారి భద్రత చట్టం అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం మరో నూతన సంస్కరణకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూళ్లను అందుబాటులోకి తీసుకు రానుంది. ఇకపై రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లనవసరం లేకుండా ఈ స్కూళ్లలో డ్రైవింగ్ శిక్షణ పొందిన వారికి నేరుగా డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. మోటారు వాహన చట్టం మార్పులో భాగంగా ఇకపై డ్రైవింగ్ లైసెన్స్ ప్రక్రియ అంతా కూడా ప్రైవేటు భాగస్వామ్యంలో సాగనుంది. ఈ చట్టం జూన్ ఒకటి నుంచి అమలులోకి రానుంది. కాగా, జిల్లాలో ఇప్పటివరకు అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూల్ లేదు సరికదా ఇప్పటికిప్పుడు డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు కూడా కష్టమే. రవాణా శాఖ చట్టం నిబంధన మేరకు అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేయాలంటే పలు నిబంధనలు కఠినంగా ఉన్నాయి. ఇప్పుడున్న వారు ఏర్పాటుకు సముఖంగా లేరు. డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు సంస్థలు, వ్యక్తులు ముందుకు వస్తే అనుమతి ఇస్తామని రవాణా శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**పారదర్శకతతో డ్రైవింగ్ ఉంటేనే..**

అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూళ్లు ఇచ్చే డ్రైవింగ్ శిక్షణ నాణ్యమైనదిగా, సమర్థవంతమైనదిగా, పారదర్శకతతో ఉంటే లైసెన్స్‌లు ఇవ్వాలనేది రవాణా శాఖ ముఖ్యోద్దేశం. ఈ డ్రైవింగ్ స్కూళ్లు ఇచ్చే 5–ఏ సర్టిఫికేట్ల ఆధారంగా నేరుగా లైసెన్స్ జారీ చేస్తారు. డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో రవాణా శాఖ అధికారులను పరిమితం చేస్తూ తీసుకొస్తున్న అక్రిడేటెడ్ స్కూళ్ల ఏర్పాటు ప్రస్తుతం కష్టతరంగానే ఉండబోనుంది. ప్రస్తుతం ఉన్న సాధారణ డ్రైవింగ్ స్కూళ్లు కూడా కఠిన నిబంధనలతో స్కూళ్ల ఏర్పాటు కష్టమే అంటున్నారు.

### మూడెకరాలు కావాల్సిందే..

డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు కనీసం మూడెకరాల స్థలం కావాలి. రెండెకరాల్లో డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్, ప్రాథమిక శిక్షణ కోసం సిమ్యులేటర్లు ఏర్పాటు చేయాలి. మరో ఎకరంలో శిక్షణ తరగతుల కోసం భవనం, తరగతి గదులు, ఇంటర్‌నెట్ సదుపాయం, ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థ, టీచింగ్ పరికరాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఇందుకు పెద్దమొత్తంలో పెట్టుబడి అవసరం. భూముల విలువ రూ.లక్షలు, రూ.కోట్లలో ఉండగా మూడెకరాల్లో డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు కష్టమే అంటున్నారు. అయినా ముందుకు వచ్చి ఏర్పాటు చేస్తే ఆదాయం ఆ స్థాయిలో ఉంటుందా అనేది అనుమానమేనని అంటున్నారు.

### వికసించిన మే పుష్పం



సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో మే పుష్పం వికసించింది. ఏటా మే నెలలో మాత్రమే పూసే ఈ పువ్వు గ్రామానికి చెందిన ఎలుగు రాజలింగం ఇంటి ఆవరణలో మంగళవారం వికసించింది. ఒకేసారి మూడు పువ్వులు పూయడం సంతోషంగా ఉందని రాజలింగం కుటుంబ సభ్యులు తెలిపారు. ఈఏడాది మొత్తం ఐదు పువ్వులు పూశాయని పేర్కొన్నారు. ఈ పూలను చూసేందుకు స్థానికులు తరలి వస్తున్నట్లు వారు తెలిపారు.